సాక్షి
అన్నమయ్య జిల్లా

శుక్రవారం। 14। ఫిబ్రవరి। 2025



ప్రచార యావ.. ప్రమాదాలకు తోవ

కూటమి నేతల ప్రచార యావ ప్రమాదాలకు తోవగా మారింది. ఎలాంటి అనుమతులు లేకున్నా ఎక్కడపడితే అక్కడ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో సమస్య తలెత్తింది. -8లో



ఇంటికి వెళ్లకనే.. అనంత లోకాలకు

కువైట్‌కు వెళ్లిన మహిళ తిరిగి సొంత ఊరికి బయలుదేరింది.మరికొన్ని నిమిషాల్లో ఇంటికి చేరుకోనున్న సమయంలో ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.130	రూ.160
రెండోరకం	రూ.90	రూ.120

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 41 మెట్రిక్ టన్నులు



పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	370	710
సీబీ	730	730

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 171.120 కిలోలు

న్యూస్‌రీల్

జాతరకు ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ: మదనపల్లె మండలం సీటీఎం నలవీర గంగా భవానీ జాతరకు శుక్రవారం నుంచి ఆదివారం వరకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ–2 డిపో మేనేజర్ అమరనాథ్ తెలిపారు. శుక్ర, శనివారాలు 15 బస్సులు, ఆదివారం 5 బస్సులు నడపనున్నట్లు చెప్పారు. భక్తులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని కోరారు.

తహసీల్దార్ల బదిలీ

రాయచోటి టౌన్: జిల్లాలో నలుగురు తహసీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా కలెక్టరేట్‌లో ప్రొటోకాల్ సెక్షన్‌లో డిప్యూటీ తహసీల్దార్ నరసింహకుమార్‌ను రాయచోటి ఎలక్షన్ డీటీగా, తహసీల్దార్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. రాయచోటి తహసీల్దార్‌గా పని చేస్తున్న వి.పుల్లారెడ్డిని నందలూరుకు , నందలూరు తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న అమర్నాథ్‌ను నిమ్మనపల్లెకు, నిమ్మనపల్లె తహసీల్దార్‌గా పనిచేస్తున్న ధర్మాంజనేయులును మదనపల్లెకు బదిలీ చేశారు.

ఉపాధి మరో 50 రోజులకు పెంపు

బి.కొత్తకోట: ఎంజీఎన్ఆర్‌జీఎస్ ద్వారా గ్రామాల్లో పనులు చేస్తున్న కూలీలకు మరో 50 రోజుల అదనపు పనిదినాలను కల్పిస్తూ గురువారం కేంద్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఏపీడీ ఎస్.మధుబాబు తెలిపారు. ప్రస్తుతం జిల్లాలోని 30 మండలాల్లో 1,48,104 కుటుంబాలు ఉపాధి జాబ్‌కార్డులు కలిగి ఉన్నట్లు చెప్పారు. వీరిలో 10,476 కుటుంబాలు వందరోజులు పనిదినాలు పూర్తి చేసుకున్నాయని చెప్పారు. మిగిలిన కుటుంబాలు వందరోజులు పని దినాలు చేసుకోవచ్చని, అదనంగా మరో 50 రోజుల పనిదినాలను కూడా ఉపయోగించుకు లబ్ధి పొందొచ్చని, శుక్రవారం నుంచే పనుల్లోకి రావొచ్చని చెప్పారు. ఉపాధి పనుల ద్వారా ప్రతి కూలీకి రోజుకు రూ.300 వస్తుందని తెలిపారు.

భలే సౌరవిద్యుత్ బైక్..



సౌరవిద్యుత్‌బైక్‌ను ఆవిష్కరిస్తున్న ఏయూ చాన్స్‌లర్ చొప్పా గంగిరెడ్డి

రాజంపేట: పర్యావరణహితమైన సౌరవిద్యుత్ బైక్‌ను అన్నమాచార్య యూనివర్సిటీ విద్యార్థులు కనుగొన్నారు. ఈఈఈ చదువుతున్న నవీన్‌కుమార్‌రెడ్డి,మణిధనుష్‌వర్మ, శివమహేశ్వర్‌రెడ్డి,నజీర్ హుసేన్‌లు పర్యవేక్షకుడు సాయిసందీప్ ఆధ్వర్యంలో దీనిని రూపొందించారు. 30కిలోమీటర్ల మైలేజీని అందిస్తోంది. ఈ బైక్ బీఎల్‌డీసీ మోటారు సాయంతో పనిచేస్తుంది. ఇంధనం వినియోగాన్ని తగ్గించడంతోపాటు పర్యావరణకు పరిరక్షణకు దోహదపడుతుందని విద్యార్థులు చెబుతున్నారు. గురువారం ఏయూ చాన్స్‌లర్ చొప్పాగంగిరెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐటీఎస్ వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ఏయూ వైస్‌చాన్స్‌లర్ సాయిబాబరెడ్డి, ప్రో–చాన్స్‌లర్ చొప్పా అభిషేక్‌రెడ్డి, రిజిస్ట్రార్ మల్లికార్జునరావు, ప్రిన్సిపాల్ డా.నారాయణ. ఈఈఈ హెచ్‌వోడీ పద్మలలిత పాల్గొన్నారు. పర్యావరణహితబైక్‌ను రూపొందించిన విద్యార్థులను చొప్పా అభినందించారు.

ప్రతి రైతుకు యూనిక్ కోడ్



రైతుల యూనిక్ కోడ్ ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి చంద్రానాయక్

చిన్నమండెం: ఆధార్‌కార్డు తరహాలో ప్రతి రైతుకు ఒక యూనిక్ కోడ్ కేటాయించేందుకు చర్యలు ప్రారంభించినట్లు జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్ తెలిపారు. గురువారం చిన్నమండెం మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వ్యవసాయ శాఖలో రైతులకు 11 అంకెలతో కూడిన ప్రత్యేక కార్డును జారీ చేస్తున్నారని, ఇది వారికి గుర్తింపుకార్డుగా ఉపయోగపడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వారికి మరింత చేరువ చేయడానికి ఆధార్ తరహా ప్రత్యేక కార్డులు జారీ చేయనున్నట్లు చెప్పారు. మన రాష్ట్రంలో ఈ పోర్టల్ జనవరి 26వ తేదీ నుంచి అందుబాటులోకి వచ్చిందన్నారు. విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదుకు ఆధార్, పట్టాదారు పాసుబుక్, మొబైల్ నంబర్ తీసుకొని గ్రామంలోని రైతు సేవా సిబ్బందిని కలిసి నమోదు చేయించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రమేష్, గీత, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మానవ గుట్టు వీడుతుందిక!

- లంకమలలో బయటపడిన ఆ గీతలు 17 శతాబ్దాల నాటి రాతలు
- సర్వేకు షరతులతో అటవీశాఖ అనుమతి
- ఈనెలాఖరులో పురావస్తుశాఖ బృందం రాక



ఈ గీతలు ఎవరి రాతో తేలనుంది

బి.కొత్తకోట: తనఒడిలో ఒదిగి ఎదిగిన నాలుగో శతాబ్దపు మానవజాతి జాడలు, వారి మనుగడ చరిత్రను శతాబ్దాలుగా దాచుకున్న లంకమల అభయారణ్యం ఇప్పుడు బాహ్య ప్రపంచానికి తెలిపే రోజు వచ్చేసింది. వైఎస్సార్ జిల్లాలోని సిద్దవటం అభయారణ్యంలో మానవ శాసనాల అధ్యయనం, వాటి నమూనాలు తీసుకునేందుకు సర్వే నిర్వహించడానికి అటవీశాఖ వన్యప్రాణి విభాగం పీసీసీఎఫ్ అజయ్‌కుమార్ నాయక్ అనుమతి ఇస్తూ బుధవారం ఉత్తర్వు జారీ చేశారు. దీంతో లంకమలలో ఐదుగురితో కూడిన భారతీయ పురావస్తుశాఖ (మైసూర్) బృందం ఈనెలాఖరులో అడుగు పెట్టనుంది. మూడు రోజుల పాటు అడవిలో అధ్యయనం చేయనుంది. ఆనాటి మానవులు సంచరించిన, మనుగడ సాగించిన లంకమలలోని నీటి పరివాహక ప్రాంతాలు, ఇప్పటిదాకా లభ్యమైన ఆధారాల మేరకు సర్వే సాగనుంది. సిద్దవటానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో లంకమలలోని వెలుగుపల్లి, జంగాలపల్లి, కొండూరు, రోళ్లబోడు, ముత్తుకూరు, సిద్దవటం, మద్దూరు అటవీ ప్రాంతాల్లో నాలుగు నుంచి 14వ శతాబ్దం వరకు మానవ మనుగడకు సంబంధించిన శాసనాలు, లిపి, భాష, సంస్కృతంతో కూడిన శాసనాలు వెలుగులోకి వచ్చాయి. ఈ ప్రాంతాల్లో సంచరించిన నాటి మానవులు తమ మనుగడ గురించి బండలపై గీతలతో చెప్పుకున్నారు. తాము ఆరాధించే దేవుళ్ల గురించి, ఇక్కడి ముఖ్యమైన వ్యక్తులు, అక్షరం గురించి తెలియని నాటి మానవులు బండలపై పదునైన వస్తువుతో గీకి తమకు తెలిసిన భాషలో తమ జాడలను లిఖించుకున్నారు. వీరి సంచారం ఎక్కడెక్కడ ఉండేదో అక్కడ ఆధారాలను చెక్కారు. వీటి ఆధారంగా వారి జీవన విధానం, మనిషి మనుగడ ఎలా సాగింది అన్నది వెలుగులోకి రానుంది.ఇప్పటికే లభించిన శాసనాల్లో కొన్నింటిని పురావస్తుశాఖ డైరెక్టర్ డాక్టర్ కే.మునిరత్నంరెడ్డి విశ్లేషించగా రాయలసీమలో తొలిసారిగా శంఖులిపి శాసనం వెలుగు చూడం ఎంతో విశేషమని, దీనిపై అధ్యయనం అవసరమని అన్నారు. శైవ, వైష్ణవం ఇక్కడ వర్ధిల్లినట్టు, అప్పటి మానవులు వీటిని ఆచరించినట్టు ఆధారాలు, విగ్రహాలు లభ్యమయ్యాయి. జరగబోయే అధ్యయనంతో మానవజాతికి సంబంధించిన తెలియని ఎన్నో ఆసక్తికర విషయాలను వెలుగులోకి తీసుకురానున్నారు.

అనుమతి మంజూరు: లంకమల అభయారణ్యంలో పురాతన మానవ రహస్యాలను ఛేదించేందుకు రాబోతున్నట్టు పురావస్తుశాఖ జిల్లా అధికారులకు సమాచారం పంపింది. శాసనాలపై అధ్యయనం కోసం అడవిలోకి వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలంటూ పురావస్తుశాఖ డైరెక్టర్ మునిరత్నంరెడ్డి అటవీశాఖ పీసీసీఎఫ్‌కు వినతి పంపారు.దీంతో వన్యప్రాణి సంరక్షణ పీసీసీఎఫ్ అజయ్‌కుమార్ నాయక్ నుంచి అనుమతి ఉత్తర్వులు గురువారం అందాయి. అడవిలోకి ప్రవేశించడం, అక్కడి శాసనాలను కాపీ చేసుకోవడం, అధ్యయనం చేసుకోవడానికి అనుమతి మంజూరు చేశారు. అడవిలోకి ప్రవేశించే ముందు కర్నూలు సీఎఫ్, వైఎస్సార్ జిల్లా డీఎఫ్‌ఓల నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని సూచించారు. అడవిలోకి వెళ్లే బృందాల వివరాలు, వారి సంఖ్యను వైఎస్సార్ జిల్లా అటవీశాఖ అధికారికి తెలియజేయాలని ఉత్తర్వుల్లో సూచించారు. ఫిబ్రవరి, మార్చి నెలల్లో అనుమతి ఉంటుందని, ప్రతిరోజూ ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకే అడవిలో ఉండాలని నిబంధన పెట్టారు. చెట్లను నరకడం లేదా ధ్వంసం చేయడం చేయరాదని, రాత్రివేళల్లో అనుమతి ఉండదని పేర్కొన్నారు. భూమి తవ్వడం లేదా వంట కోసం మంటలు వేయరాదని నిబంధన విధించారు. ఈ సర్వేకు అనుమతి కల్పించిన అటవీశాఖ పీసీసీఎఫ్ చిరంజీవి చౌదరికి డైరెక్టర్ మునిరత్నంరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

శంఖులిపి అధ్యయనం కష్టం

లంకమలలో వెలుగుచూసిన శంఖులిపి శాసనాలను విశ్లేషించి వాటి విషయాలను తెలియజెప్పడం అంత సులువైన పనికాదని పురావస్తుశాఖ అధికారులు చెబుతున్నారు. 6వ శతాబ్దానికి చెందిన ఈ లిపి ఎక్కువ కాలం మనుగడ సాగించనందున అధ్యయనం కష్టమని అంటున్నారు.ఇప్పటిదాకా రాయలసీమలో ఈ లిపిని కనుగొనడం ఇదే మొదటిసారి. దీనిపై లోతైన అధ్యయనం అవసరమని అధికారులు చెబుతున్నప్పటికీ ఎలా విశ్లేషిస్తారన్న దానిపై ఉత్సుకత నెలకొంది. శంఖులిపిని విశ్లేషించే ఏకైక వ్యక్తి కలకత్తా విశ్వవిద్యాలయానికి



బండపై శంఖులిపి శాసనం

చెందిన ప్రొఫెసర్ డాక్టర్ బీఎం.ముఖర్జీ ఒక్కరే. ఆయన లేకపోవడంతో ఆయన వద్ద పనిచేసిన ఓ ప్రొఫెసర్‌కు ఈ శాసనాలను పంపి విశ్లేషణ చేయించుకోవాల్సి ఉంది.

వెలుగులోకి తెచ్చిన కళావతి



సిద్దవటం అటవీశాఖ క్షేత్రాధికారిణి బి.కళావతి ఆసక్తితోనే లంకమలలో మానవుల జాడ ఆధారాలు వెలుగులోకి వచ్చాయి. కూంబింగ్ చేసేటప్పుడు కంటపడిన ఈ శాసనాలు, జలపాతం, ఎగువ కైలాసం, దిగువ కైలాసంగా పలిచే ప్రాంతాలను ఫొటోలతో వెలుగులోకి తెచ్చారు. ఆమె చూపిన ఆసక్తి ఇప్పుడు లంకమలలో అధ్యయనానికి దారి చూపింది.

నేడు వైఎస్ జగన్ రాక



కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం వైఎస్సార్ జిల్లాకు రానున్నారు. 14వ తేదీ ఉదయం 9 గంటలకు తాడేపల్లిలోని ఆయన నివాసం నుంచి బయలుదేరి 9.05కు తాడేపల్లిలోని హెలీప్యాడ్ చేరుకుంటారు. 9.10కి అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 10.40కి కడప విమానాశ్రయానికి వస్తారు. 10.50కు ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి 11 గంటలకు స్థానిక మద్రాసు రోడ్డులోని మేడా రఘునాథరెడ్డి కన్వెన్షన్ హాలుకు చేరుకుంటారు. అక్కడ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి కుమారుడి వివాహ రిసెప్షన్‌లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదిస్తారు. 11.15కి అక్కడి నుంచి బయలుదేరి 11.25కి తిరిగి కడప ఎయిర్‌పోర్టుకు వెళ్తారు. 11.30కి కడప విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 12.30కి బెంగళూరులోని జక్కూరు ఎరోడ్రమ్ చేరుకుని, అటు నుంచి యలహంకలోని తన నివాసానికి వెళ్లనున్నారు.

నిర్వాసితుల స్థల పరిశీలన



నిర్వాసితుల స్థలాన్ని పరిశీలిస్తున్న జేసీ అదితి సింగ్

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయం టీటీడీలో విలీనమై, రూ.100 కోట్లతో అభివృద్ధి పనులు మొదలు పెట్టినప్పటి నుంచి ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారం నచ్చక కొన్నేళ్లుగా స్థలాన్ని ఇచ్చేందుకు నిరాకరిస్తున్న నిర్వాసితుల స్థలాన్ని గురువారం కడప జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాల్లో పెండింగ్‌లో 1500/బీ1 సర్వే నంబర్లు గల నిర్వాసితుల స్థలం వద్దకు స్థానిక తహసీల్దార్ రమణమ్మ, ఆర్డీఓ జాన్ ఇర్విన్‌తో కలిసి వెళ్లి పరిశీలించారు. ఆ స్థలానికి సంబంధించి సర్వే నంబరు, విస్తీర్ణతను రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

కలెక్టర్ సమక్షంలో అక్రమ నిర్మాణాలు తొలగింపు



ఆక్రమణదారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి



కోటపల్లె రోడ్డులో అక్రమ నిర్మాణం తొలగింపు

పీలేరు: పీలేరు మండలంలోని పలు ప్రాంతాల్లో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి సమక్షంలో అక్రమ నిర్మాణాలు తొలగింపు కార్యక్రమం చేపట్టారు. పీలేరుతోపాటు మండలంలోని వివిధ పంచాయతీల్లో అక్రమ నిర్మాణాలపై కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయి. దీంతో గురువారం స్థానిక నాగిరెడ్డి కాలనీలో సర్వే నంబరు 72/2లో అక్రమంగా చేపట్టిన నిర్మాణాన్ని, తిరుపతి రోడ్డు మార్గంలోని సర్వే నంబరు 471లో నాలుగు అక్రమ నిర్మాణాలను తొలగించారు. అలాగే కోటపల్లె మార్గంలో 564 సర్వే నంబరులో ఇంటి నిర్మాణాన్ని పాక్షికంగా తొలగించారు. తలపుల పంచాయతీలో రాజశేఖర్‌రెడ్డి అనే వ్యక్తి ఫారెస్ట్, ప్రభుత్వ భూమి దాదాపు 24 ఎకరాలు ఆక్రమించుకుని మామిడి చెట్లు తోపాటు షెడ్లు నిర్మాణం చేపట్టాడు. పరిశీలించిన కలెక్టర్ అక్రమ నిర్మాణాలు తొలగించి సంబంధిత భూమిని స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, తహశీల్దార్ భీమేశ్వర్‌రావు, సీఐ యుగంధర్, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పది పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్ రావు

రాయచోటి: జిల్లాలో పదోతరగతి పరీక్షలను ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్‌ఓ) మధుసూదన్ రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో డీఆర్‌ఓ అధ్యక్షతన పదోతరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణపై జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. జిల్లా వ్యాప్తంగా మార్చి 17 నుంచి 31వ తేదీ వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

121 కేంద్రాలు, 22,355 మంది విద్యార్థులు

121 పరీక్ష కేంద్రాల్లో 22355 మంది విద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. ఇందులో రెగ్యులర్ విద్యార్థులు 22050 మంది, ఒకసారి ఫెయిల్ అయిన వారు 305 మంది పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. 834 మంది ఓపెన్ స్కూల్ విద్యార్థులు కూడా 19 కేంద్రాలో పరీక్ష రాయనున్నట్లు చెప్పారు. పరీక్ష కేంద్రాలలో అవసరమైన మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా ముందస్తు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈనెల 15లోగా రూట్ ఆఫీసర్లు, జాయింట్ కస్టోడియన్లను నియమించాలన్నారు. అలాగే 26వ తేదీలోగా ఇన్విజిలేటర్ల నియామకాలు పూర్తి చేయాలని విద్యాశాఖాధికారులకు సూచించారు.



మాట్లాడుతున్న డీఆర్‌ఓ మధుసూదన్ రావు

- పరీక్షల సమయంలో కేంద్రాల వద్ద తగిన బందోబస్తు ఏర్పాటు చేయాలని, 144 సెక్షన్ అమలు చేయాలని పోలీస్ శాఖ అధికారులకు సూచించారు. అన్ని పరీక్షా కేంద్రాలను నో ఫోన్ జోన్‌గా ప్రకటించినట్లు చెప్పారు.టాస్క్‌ఫోర్స్, ఫ్లయింగ్ స్క్వాడ్స్ వారి విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించి మాస్ కాపీయింగ్‌ను నిర్మూలించాలన్నారు.

బస్సు సౌకర్యం: పరీక్షల రోజులలో అవసరమైనచోట విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా అదనపు బస్సులు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ వారిని ఆదేశించారు. విద్యుత్ అంతరాయం లేకుండా తగిన చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ అధికారులను, పరీక్షల చీఫ్ సూపరిటెండెంట్లు అందజేసే సీల్డ్ పరీక్ష జవాబు పత్రాలను స్వీకరించాలని పోస్టు మాస్టర్లకు తెలియపరిచారు. పరీక్ష కేంద్రాల వద్ద వైద్య శిబిరం ఏర్పాటు చేసి అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచుకోవాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. డీఈఓ సుబ్రమణ్యం, డిప్యూటీ డీఈఓ శివప్రకాష్ రెడ్డి, విద్యుత్ శాఖ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, డిపిఆర్‌ఓ పురుషోత్తం, వైద్య, ఖజానా, పోలీస్, రవెన్యూ, ఆర్టీసీ, రవాణశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జవహర్ నవోదయ విద్యాలయాలను పటిష్టంగా నిర్వహించాలి

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేసే జవహర్ నవోదయ విద్యాలయాలను పటిష్టంగా నిర్వహించాలని డీఆర్‌ఓ మధుసూదన్ రావు అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ వీసీహాల్‌లో జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశాల మేరకు డీఆర్‌ఓ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. జవహర్ నవోదయ విద్యాలయాల ఏర్పాటు, పనితీరు, నిర్వహిస్తున్న తరగతులు, ఎంపిక విధానం, విద్యార్థుల సంఖ్య, అకడమిక్ కార్యక్రమాలు, లైబ్రరీ, ల్యాబులు, విజ్ఞాన జ్యోతి ప్రోగ్రామ్, పీఎం శ్రీ ప్రోగ్రామ్ తదితరాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నారమరాజుపల్లి, జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ గీత సమావేశంలో వివరించారు. గ్రామీణ ప్రాంత పిల్లలకు ఉత్తమ బోధనను అందించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.

గురుకులం.. భవితకు మూలం

- ఐదో తరగతి, ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తులు
- ఏప్రిల్ 6న ప్రవేశ పరీక్ష



మదనపల్లె సిటీ: పేద, మధ్య తరగతి కుటుంబాల పిల్లలకు ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాలు ఒక వరం లాంటివి. పేద విద్యార్థులకు ఉచిత విద్య అందించేందుదకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం దరఖాస్తులు కోరుతోంది. పేద, మధ్య తరగతి వర్గాల్లోని ఎస్సీ,ఎస్టీ, బీసీ, ఈబీసీ విద్యార్థులు ఐదో తరగతి, ఇంటర్మీడియట్‌లో చేరేందుకు గురుకులంలో దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం ప్రకటించింది. జిల్లాలోని అన్ని మండలాల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. కార్పొరేట్ తరహాలో 2025–26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు మార్చి 6వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఒకసారి సీటు పొందింతే వసతితో పాటు ఇంటర్మీడియట్ వరకు ఉచితంగా చదువుకోవచ్చు. ఇంగ్లీషు మీడింలో బోధనతో పాటు నీట్,ఐఐటీలో ఉచితంగా శిక్షణ ఇస్తారు. విద్యార్థులు ఏప్రిల్ 6వతేదీ జరిగే కామన్ టాలెంట్ ఎంట్రన్స్‌లో ప్రతిభ చూపి ప్రవేశాలు పొందవచ్చు. మదనపల్లె సమీపంలోని చంద్రకాలనీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో ఐదో తరగతి 80 సీట్లు , ఇంటర్మీడియట్ ఎంపీసీ 40 సీట్లు, బైపీసీ 40 సీట్లు మొత్తం 80 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇంటర్‌లో దరఖాస్తు చేసినప్పుడు నీట్, ఐఐటీ శిక్షణల్లో దేనిని తీసుకుంటారో ఆప్షన్ ఇవ్వాల్సి ఉంటుంది. ప్రభుత్వం నిర్వహించే కామన్ పరీక్షలకు కూడా పంపుతారు. అక్కడ ప్రతిభ చూపిన వారిని రాష్ట్ర స్థాయి ప్రతిభాపరీక్షలకు పంపుతారు.



డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల



ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

గురుకులంలో ప్రవేశానికి విద్యార్థినులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఐదో తరగతి, ఇంటర్మీడియట్‌కు http:// apbragset. apcfss. in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి.మార్చి 6వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు నమోదు చేసుకోవాలి.విద్యార్థులు ఎంపిక చేసుకున్న పాఠశాల, కళాశాల వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలి. వివరాలు సబ్‌మిట్ చేసిన తరువాత మార్చుకునే అవకాశం ఉండదు.

ప్రవేశానికి అర్హతలు

ఐదో తరగతి ప్రవేశానికి ఎస్సీ,ఎస్టీ విద్యార్థినులు 1 సెప్టెంబర్ 2012 నుంచి 31 ఆగస్టు 2016 మధ్య జన్మించి ఉండాలి. ఓసీ,బీసీ విద్యార్థులు 1 సెప్టెంబర్ 2014 నుంచి 31 ఆగస్టు 2016 మధ్య జన్మించి ఉండాలి. జూనియర్ ఇంటర్ ప్రవేశాలకు 2024–25 ఏడాదిలో పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్నవారు అర్హులు. వయస్సు 2025 ఆగస్టు 31 నాటికి 17 సంత్సరాలు దాటి ఉండరాదు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం, సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న వారికి ఏడాది సడలింపు ఉంటుంది. విద్యార్థులు సొంత జిల్లాలో 2023–24 ఏడాదిలో 3వ తరగతి, 2024–25లో 4వ తరగతి ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో చదివి ఉండాలి. ఐదు, ఇంటర్‌కు దరఖాస్తు చేసుకున్న వారి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.లక్ష దాటకూడదు.

సద్వినియోగం చేసుకోవాలి



గురుకులంలో ఐదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు అన్ని సౌకర్యాలతో ఉచిత విద్యను అందిస్తాం.. పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఇది చక్కని అవకాశం. అందరూ సద్వినియోగం చేసుకోవాలి. -వసుంధరాదేవి, గురుకులం ప్రిన్సిపాల్, మదనపల్లె

‘సూపర్ సిక్స్’ అమలులో ప్రభుత్వం విఫలం

రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి

ఒంటిమిట్ట: సూపర్ సిక్స్ హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని చెర్లోపల్లి గ్రామంలో ఆయన కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారంలోకి రాక ముందు ఎన్నో రకాల హామీలు ఇచ్చిన సీఎం చంద్రబాబునాయుడు అధికారంలోకి రాగానే హామీలను మరిచారని అన్నారు. సంపద సృష్టిస్తాం అనే అబద్ధపు మాటలతో మభ్యపెడుతున్నారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలన్నీఅమలు చేశారని తెలిపారు. అనంతరం చెర్లోపల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు చామ సుబ్బారెడ్డి, భారతి దంపతుల కుమార్తె నిశ్చితార్థ వేడుకలకు ఆయన హాజరయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర మాజీ గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్ రెడ్డి, రాష్ట్ర మాజీ గృహనిర్మాణ సంస్థ కార్పొరేషన్ డైరెక్టర్ ఇరగం రెడ్డి సుబ్బారెడ్డి, ఒంటిమిట్ట మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు టక్కోలు శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మైనర్ ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : తల్లి మందలించిందనే మనస్తాపంతో మైనర్ బాలుడు పురుగుమందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించిన ఘటన గురువారం మదనపల్లె మండలంలో జరిగింది. కొత్త ఇండ్లకు చెందిన మైనర్ బాలుడు(13) ఏడో తరగతి చదువుతున్నాడు. పాఠశాలకు వెళ్లకుండా చిల్లర తిరుగుళ్లు తిరుగుతుండటంతో బడికి ఎందుకు వెళ్లలేదని మందలించింది. మనస్తాపం చెందిన రాజా సాయిప్రదీప్ ఇంటివద్దే పురుగుమందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. బాధితుడిని ఆస్పత్రికి తరలించారు.

బెల్టు షాపుపై దాడి

కలికిరి: మండల పరిధిలోని పల్లవోలులో బెల్టు షాపుపై దాడి నిర్వహించిన స్పెషల్ పార్టీ పోలీసులు అక్రమ మద్యంతో పాటు నిర్వాహకుడిని అదుపులోకి తీసుకుని కలికిరి పోలీసులకు అప్పగించారు. వివరాలిలా ఉన్నాయి. పల్లవోలు కస్బాలో బెల్టు షాపు నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు స్పెషల్ పార్టీ పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. మనోహర్ అక్రమంగా నిల్వ ఉంచిన 50 క్వార్టర్ బాటిళ్లను స్వాధీన పరచుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించి అప్పగించారు.

ఆక్రమణల కూల్చివేతకు యత్నం


ఇల్లు కూల్చివేతను అడ్డుకుంటున్న బాధితుడు

మదనపల్లె : మండలంలోని చిప్పిలి బంగారు కొత్తపేటలో ప్రభుత్వస్థలంలో నిర్మించిన ఆక్రమణల కూల్చివేతకు గురువారం రెవెన్యూ అధికారులు ప్రయత్నించారు. బాధితులు 15 ఏళ్లుగా నివాసం ఉంటున్న తమ ఇల్లు, ఎవరో ఫిర్యాదు చేశారని కూల్చివేతకు ప్రయత్నించడం మంచిది కాదని జేసీబీకి అడ్డుతగిలారు. జేసీబీని ముందుకు వెళ్లనివ్వకుండా కూర్చుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. బంగారు కొత్తపేటలోని 61 సర్వేనెంబర్‌లో కమ్యూనిటీ పర్పస్‌కు ప్రభుత్వం కేటాయించిన 43 సెంట్ల భూమిలో అక్రమ నిర్మాణాలు చేస్తున్నారన్నారు. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోలేదన్నారు. ఎలాంటి పట్టా లేకున్నప్పటికీ దౌర్జన్యంగా ఆయన ఇల్లు నిర్మించేశారన్నారు. ఆ ఇంటిని సాకుగా చూపి ఇపుడు దారి లేదంటూ కక్షపూరితంగా ఫిర్యాదు చేయడంతో తమ ఇల్లు కూలుస్తున్నారన్నారు. ఇల్లు కూలివేత విషయమై ఇప్పటికే కోర్టుకు వేశామని, ఆక్రమణదారులు నోటీసులు అందుకునేందుకు ముందుకు రాక ఉద్దేశపూర్వకంగా ఇబ్బంది కలిగిస్తున్నారని బాధితులు వాపోయారు. దీంతో రెవెన్యూ అధికారులు చేసేదిలేక వెనుదిరిగి వెళ్లిపోయారు. కార్యక్రమంలో ఆర్‌ఐ శేషగిరిరావు పాల్గొన్నారు.

ప్రచార యావ ... ప్రమాదాలకు తోవ


మైదుకూరురోడ్డులో సెంట్రల్ లైటింగ్ స్తంభాలకు అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు


సిద్దవటం రోడ్డుకు అడ్డంగా పడిన ఫ్లెక్సీ

- పట్టణంలో అడ్డగోలుగా ఫ్లెక్సీల ఏర్పాటు
- సర్కిళ్లు, డివైడర్లను వదలని వైనం
- ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్న కూటమి నేతలు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు


ఈ చిత్రంలో గాయాలతో కనిపిస్తున్న వ్యక్తి పేరు పోకల మల్లేశ్వర్‌రెడ్డి. బద్వేల్ మండలం మల్లంపేట గ్రామానికి చెందిన ఈయన ఓ పని నిమిత్తం పట్టణానికి వస్తున్న క్రమంలో సిద్దవటం రోడ్డులోని ఎన్‌జీవోకాలనీ సమీపంలో డివైడర్ల మధ్యలో సెంట్రల్ లైటింగ్ స్తంభానికి అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ మీద పడటంతో గాయాలపాలయ్యాడు. ఘటన జరిగిన సమయంలో వెనుకవైపు నుండి భారీ వాహనాలు రాకపోవడంతో ప్రమాదం తప్పింది.

బద్వేలు అర్బన్ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్ జిల్లా బద్వేల్ పట్టణంలో ఎన్నడూ లేని విధంగా ఎక్కడబడితే అక్కడ ఫ్లెక్సీలు వెలుస్తున్నాయి. చిన్నా చితక కార్యక్రమాలు, కూటమి నేతల పుట్టినరోజు వేడుకలు... ఇలా ప్రతి కార్యక్రమానికి విపరీతమైన ప్రచారంతో మున్సిపల్ అధికారుల అనుమతులు లేకుండానే ఫ్లెక్సీలు ఏర్పాటుచేస్తున్నారు. ముఖ్యంగా పట్టణంలోని మైదుకూరు రోడ్డు, నాలుగు రోడ్ల కూడలి, సిద్దవటం రోడ్డు, బైపాస్ రోడ్డు ఇలా అనేక చోట్ల ఫ్లెక్సీలు వెలిశాయి. చివరకు జాతీయ రహదారి-67లోని మైదుకూరు రోడ్డు, నెల్లూరురోడ్డులలోని డివైడర్లలోనూ ఫ్లెక్సీలు వెలిశాయి. పట్టణ సుందరీకరణలో భాగంగా ప్రభుత్వ హయాంలో కుడా నిధులతో డివైడర్లను సుందరంగా తీర్చిదిద్దారు. అయితే కూటమి నేతలు అడ్డగోలుగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

అనుమతులు లేకుండానే ఏర్పాటు

పట్టణ పరిధిలో ప్రచార నిమిత్తం బ్యానర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలంటే తప్పనిసరిగా పురపాలక పట్టణ ప్రణాళిక విభాగం నుండి అనుమతులు తీసుకోవడంతోపాటు నిర్దేశించిన రుసుము చలానా రూపంలో చెల్లించాలి. అంతేకాకుండా జాతీయ రహదారిపై డివైడర్ల మధ్య ఎట్టిపరిస్థితుల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకూడదనే నిబంధనలున్నాయి. అయితే ఇవేమీ పట్టని కూటమి నేతలు పురపాలక పట్టణ ప్రణాళిక విభాగం నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే ఎక్కడబడితే అక్కడ ఫ్లెక్సీలు ఏర్పాటుచేసినట్లు తెలుస్తోంది. దీంతో పట్టణ ప్రణాళిక విభాగానికి ఆదాయం సైతం తగ్గిపోతోంది.

లైటింగ్ స్తంభాలకు ఫ్లెక్సీలు

పట్టణ పరిధిలో జాతీయ రహదారి- 67లో భాగమైన మైదుకూరురోడ్డు, నెల్లూరురోడ్డులో డివైడర్ల మధ్య సెంట్రల్ లైటింగ్ స్తంభాలకు కొన్ని నెలలుగా భారీగా ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు. ప్రధాన రహదారుల్లో ఫ్లెక్సీలు ఉండడంతో వాహన చోదకులు ఫ్లెక్సీలను గమనిస్తూ డ్రైవింగ్‌పై ఏకాగ్రత కోల్పోయి ప్రమాదాలు జరిగే అవకాశం లేకపోలేదు. ఈ సమయంలో భారీ వాహనాలు వెళ్లే సందర్భంలో డివైడర్ల మధ్యలో ఉన్న ఫ్లెక్సీలకు వాహనాలు తగిలి కొన్ని చోట్ల స్తంభాలు సైతం ఒరిగిపోయాయి. అంతేగాక గాలులు వీచినప్పుడు ఫ్లెక్సీలు రోడ్డుకు అడ్డంగా పడిపోవడం, వాహన దారులపై పడడం వంటి సంఘటనలు కూడా చోటుచేసుకున్నాయి. అంతేగాక ఎదురుగా వచ్చే వాహనాలు సైతం కనిపించక ప్రమాదాలు కూడా చోటుచేసుకున్నాయి. ఇదే అంశంపై 32వ వార్డు కౌన్సిలర్ బండిచెన్నయ్య పలుమార్లు పురపాలక సర్వసభ్య సమావేశంలో ఫిర్యాదు చేసినప్పటికీ మున్సిపల్ అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడం గమనార్హం. ఇప్పటికైనా ప్రమాదాలకు అడ్డాగా మారిన ఫ్లెక్సీలను తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని పురప్రజలు కోరుతున్నారు.

నోటీసులు అందజేశాం

పట్టణంలో ఇష్టానుసారంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల విషయంపై పురపాలక సంఘం పట్టణ ప్రణాళిక విభాగం అధికారి సతీష్‌ను వివరణ కోరగా పట్టణంలోని డివైడర్లపై, ప్రధాన కూడళ్ళలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలకు ఎటువంటి అనుమతులు లేవు. ఆ మేరకు ఇప్పటికే సంబంధిత ప్రకటనదారులకు నోటీసులు అందజేశాం. అనుమతులు లేని ఫ్లెక్సీలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం.

– **సతీష్, పట్టణ ప్రణాళిక విభాగం అధికారి, వైఎస్సార్ జిల్లా**

500 హెక్టార్లలో అడవి దగ్ధం


అడవిలో చెలరేగుతున్న మంటలు

తంబళ్లపల్లె : తంబళ్లపల్లె మండల కేంద్రానికి సమీపంలోని మల్లయ్యకొండ అడవికి గురువారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో మంటలు చెలరేగి 500 హెక్టార్లలో అడవి దగ్ధమైంది. మల్లయ్యకొండ దక్షిణ భాగంలో చింతరపులకోట అటవీ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. మధ్యాహ్న సమయం కావడంతో మంటలు చెలరేగాయి. వడ్డిరోళ్ల గుట్ట, జంగం మూల, మిరపచెట్ల దిన్నె అటవీ ప్రాంతం పూర్తిగా కాలిపోయింది. అటవీ సమీప పొలాల్లోని వేరుశనగ, మామిడి మొక్కలు మంటల వేడిమికి దెబ్బతిన్నాయి. కొందరు రైతులు ఆ మంటలను పొలాల్లోకి రాకుండా అర్పివేయడంతో పంట నష్టం తగ్గింది. అడవిలోని భారీ కలప వృక్షాలు, కోట్లాది క్రిములు, కీటకాలు, అడవి జంతువులు, పక్షులు, ఔషదగుణాలు కలిగిన పలురకాల మొక్కలు అగ్నికి ఆహుతయ్యాయి.

అయ్యప్ప ఆలయంలో రికార్డులు స్వాధీనం

మదనపల్లె సిటీ : మదనపల్లె సమీపంలోని అయ్యప్ప నగర్‌లో వెలసిన అయ్యప్పస్వామి ఆలయంలో దేవాదాయశాఖ అధికారులు తనిఖీ చేశారు. ఆలయంలో రికార్డులు, ఇతర వస్తువులతోపాటు ఆలయాన్ని స్వాధీనం చేసుకున్నారు. దేవాదాయశాఖ ఈఓ రమణ ఆలయంలో ఉత్సవ కమిటీ సభ్యులు చర్చించారు. జిల్లా అధికారుల ఆదేశాలతో ఆలయాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు.

చట్ట ప్రకారమే భూ సమస్యలకు పరిష్కారం

మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్


భూ ఆక్రమణలపై ఫిర్యాదు చేస్తున్న సీపీఐ, మీడియా ప్రతినిధులు

బి.కొత్తకోట : రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన వినతులను చట్ట ప్రకారం పరిష్కరిస్తామని మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ పేర్కొన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో జరిగిన వీఆర్వోల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భూముల సమస్యలపై నోటీసులు ఇవ్వకుండా, విచారణ జరపకుండా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. బి.కొత్తకోట, మదనపల్లిల్లో 2,500 భూ సమస్యలు వచ్చాయని, డివిజన్‌లో 5,900 సమస్యలపై వినతులు అందగా 53 శాతం పరిష్కరించినట్లు చెప్పారు. ఫ్రీహోల్డ్ భూముల భూములు 23,271 ఎకరాలుండగా, 24,716 ఎకరాల భూమికి ఫ్రీ హోల్డ్ అర్హత లేదని తేల్చినట్టు చెప్పారు. ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు జరిపి ఇళ్లు నిర్మించుకున్న పేదలు క్రమబద్ధీకరణ చేసుకునే అవకాశం ఉందని చెప్పారు. అనంతరం నగర పంచాయతీ పరిధి లోని వాగులు, వంకలు, ల్యాండ్ సీలింగ్ భూములు రామాంజనేయులు అనే వ్యక్తి ఆన్‌లైన్ చేయించుకున్నారని సీపీఐ నాయకులు, జర్నలిస్టుల సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో వన్‌బీలు, రికార్డులను సబ్ కలెక్టర్ పరిశీలించి చర్యలు తీసుకోవాలని తహశీల్దారును ఆదేశించారు.

బండరాయి పడి వ్యక్తికి తీవ్రగాయాలు

మదనపల్లె : పశువులకు గడ్డి కోసేందుకు వెళ్లిన వ్యక్తిపై బండరాయి పడడంతో తీవ్రంగా గాయపడిన ఘటన గురువారం మదనపల్లెలో జరిగింది. మండలంలోని బయ్యారెడ్డికాలనీకి చెందిన అక్రమ్(40)తన పశువులకు గడ్డి కోసుకుని వచ్చేందుకు హంద్రీ నీవా కాలువ వద్దకు వెళ్లాడు. బండరాయి కింద గడ్డి కోస్తుండగా, అకస్మాత్తుగా రాయి మీద పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు.

ప్రమాదంలో ఇద్దరికి

నందలూరు: కడప-చెన్నై జాతీయ రహదారిలోని మూసివేసిన ఆల్విన్ కర్మాగారం వద్ద గురువారం తెల్లవారు జామున బైక్‌పై వెళ్తున్న ఒంటిమిట్ట రాచపల్లి గ్రామానికి చెందిన నంది మండల సునీల్, నందిమండల రమేష్‌లను గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో ఇరువురికి గాయాలయ్యాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో ఢీకొని..

మదనపల్లె : ములకలచెరువు మండలంసానివారిపల్లెకు చెందిన నరసింహులు కుమారుడు సుబ్రహ్మణ్యం(41) ములకలచెరువు నుంచి సోంపాళ్యానికి వెళుతుండగా, మార్గమధ్యంలో ఎదురుగా వచ్చిన ఆటో ఢీకొంది. ప్రమాదంలో సుబ్రహ్మణ్యం తీవ్రంగా గాయపడ్డాడు. ఆస్పత్రికి తరలించారు.

విద్యుత్తు షాక్‌తో యువకుడికి..

మదనపల్లె : విద్యుత్తు షాక్‌తో యువకుడు గాయపడిన సంఘటన గురువారం మదనపల్లె మండలంలో జరిగింది. పట్టణంలోని ప్రశాంత్ నగర్‌లో నివాసముంటున్న రామకృష్ణ కుమారుడు గురువర్ధన్(18) వేంపల్లె వద్ద ఉన్న వ్యవసాయ బోరు వద్దకు వెళ్లాడు. అక్కడ నేరేడు చెట్టుపైకి ఎక్కి దిగుతుండగా, చెట్టు కొమ్మకు ఆనుకుని ఉన్న కరెంట్ వైరు తగిలి షాక్‌కు గురై కింద పడ్డాడు. స్థానికులు వెంటనే ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం కోలుకుంటున్నాడు.

ప్రైవేట్ ఆస్పత్రి వైద్యులు, సిబ్బందిపై కేసు


మృతిచెందిన పురిటి బిడ్డ

మదనపల్లె : పురిటి బిడ్డకు చికిత్స చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించి, బిడ్డ మృతికి కారణమైన ప్రైవేట్ ఆస్పత్రి వైద్యులు, సిబ్బందిపై బాధిత తండ్రి వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు వన్‌టౌన్ సీఐ ఎరీషావలి తెలిపారు. మండలంలోని వేంపల్లెకు చెందిన వెంకటేష్, స్వాతిలకు తొలి కాన్పులో జన్మించిన పురిటి బిడ్డను జనవరి 30న పట్టణంలోని అమ్మినేని వీధిలోని సిటీ చిల్డ్రన్ హాస్పిటల్‌లో చేర్పించారు. వైద్యులు, సిబ్బంది చికిత్స అందిస్తూ బిడ్డ పరిస్థితి బాగా ఉందని చెప్పేవారు. అకస్మాత్తుగా బుధవారం ఉదయం బిడ్డ పరిస్థితి విషమంగా మారినా.. సాయంత్రం వరకూ చికిత్స చేయకుండా నిర్లక్ష్యం వహించారు. రాత్రి తమ బిడ్డను వెంటిలేటర్‌పై ఉంచామని హాస్పిటల్ యాజమాన్యం తెలిపిందన్నారు. వెంటిలేటర్ తీసివేస్తే బిడ్డ చనిపోతాడని, మీరు ఇక్కడి నుంచి తీసుకెళితే, మీరు చెల్లించిన నగదు వెనక్కి ఇస్తామంటూ బేరమాడారు. చికిత్సపై అనుమానించిన బిడ్డ తల్లిదండ్రులు తమ బంధువులకు సమాచారం అందించి డాక్టర్‌ను నిలదీశారు. రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా చికిత్స చేసి తమ బిడ్డ మృతికి కారణమైన ఆస్పత్రి వైద్యులు, సిబ్బందిపై వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. దీంతో గురువారం ఉదయం వన్‌టౌన్ సీఐ ఎరీషావలి, ఎస్‌ఐ శివకుమార్ ఆధ్వర్యంలో పురిటిబిడ్డకు గ్రూప్ ఆఫ్ డాక్టర్లచే పోస్టుమార్టం నిర్వహించారు. ప్రక్రియను వీడియో తీయించారు. అనంతరం మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు. వెంకటేష్ ఫిర్యాదుమేరకు సిటీ హాస్పిటల్ వైద్యులు, సిబ్బందిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా కేసులో నిందితులను చేర్చి విచారిస్తామన్నారు.

హత్య కేసులో ఇద్దరికి జైలు శిక్ష

సిద్దవటం : సిద్దవటం పోలీసు స్టేషన్ పరిధిలో 2015లో జరిగిన హత్యాయత్నం కేసులో ఇద్దరు నిందితులకు ఐదేళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తూ బద్వేల్ అడిషనల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి వైజే.పద్మశ్రీ తీర్పు వెలువరించినట్లు సిద్దవటం ఇన్‌చార్జి ఎస్‌ఐ శివ ప్రసాద్ తెలిపారు. విలేకరులతో గురువారం ఆయన మాట్లాడుతూ ఇంటి ముంగిట చెత్త వేసే విషయంలో ఘర్షణ జరిగిందన్నారు. ఈ సంఘటనలో సిద్దవటం ఎగువ పేటకు చెందిన చిద్దేల్ల సుజాతపై 2015లో నిందితులు అయ్యావారయ్య, అతడి భార్య పీరమ్మ కలిసి కత్తితో ఆమెపై దాడి చేశారు. సుజాత భర్త నాగరాజు ఫిర్యాదు మేరకు అప్పట్లో హత్యాయత్నం కేసు నమోదు చేశారు. గురువారం బద్వేల్ అడిషనల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి వైజే పద్మశ్రీ ముందుకు ఈ కేసు విచారణకు వచ్చిందన్నారు. సాక్షులను సకాలంలో కోర్టు నందు హాజరు పరచగా కేసు నిరూపణ అవడంతో కేసులోని ఏ1 ముద్దాయి అయ్యావారయ్య, ఏ2 ముద్దాయి పీరమ్మలకు ఐదేళ్ల జైలుశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారని తెలిపారు. నేరం రుజువు చేసి శిక్షపడేలా కృషి చేసిన బద్వేల్ ఏపీపీ కె.రవిచంద్ర, సిబ్బందిని ఎస్పీ ఈ.జి.అశోక్‌కుమార్ అభినందించారు.

బియ్యం విక్రయాలపై విచారణ

గాలివీడు : మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతిగృహంలో బియ్యం దారి మళ్లిస్తున్నారంటూ విద్యార్థి సంఘం నాయకులు చేసిన ఆరోపణలపై పూర్తి స్థాయి విచారణ జరిపి నివేదిక కలెక్టర్‌కు పంపనున్నట్లు అన్నమయ్య జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి సురేష్‌కుమార్ తెలిపారు. తహసీల్దారు భాగ్యలతతో కలిసి ఆయన గురువారం బీసీ బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హాస్టల్ సిబ్బంది రెండు బస్తాల బియ్యం విక్రయిస్తున్నారంటూ విద్యార్థి సంఘం నాయకులు తమకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారన్నారు. హాస్టల్‌ను సందర్శించగా రెండు బస్తాల రేషన్ బియ్యం అదనంగా ఉండడం గుర్తించామన్నారు. విచారణ జరిపి కలెక్టర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

దర్గాలో దర్శకుడు కృష్ణవంశీ

రామాపురం : మండలంలోని శ్రీసాయి నగర్‌లో వెలసిన సద్గురు దర్గా స్వామిజీ, సద్గురు దర్గా మాతాజీలను సినీ దర్శకులు కృష్ణవంశీ గురువారం దర్శించు కున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామిజీ భక్తుడు సత్యమయ్య దర్గా స్వామిజీ, దర్గా మాతాజీ జీవిత చరిత్ర పుస్తకాన్ని కృష్ణవంశీకి అందజేశారు.

ఇంటికి వెళ్లకనే.. అనంత లోకాలకు

- ఇంటికి వస్తూ మార్గమధ్యంలో రోడ్డు ప్రమాదం
- మహిళతో పాటు డ్రైవర్ మృతి


ప్రమాద స్థలంలో నుజ్జుయిన కారు, పక్కన క్షతగాత్రులు


బుజ్జమ్మ(ఫైల్)


మృతి చెందిన ఆఫ్గాన్ రఫీక్ ఖాన్

కలికిరి : బ్రతుకు దెరువుకోసం కువైట్‌కు వెళ్లింది. తిరిగి సొంత ఊరికి వస్తూ.. మరి కొన్ని నిమిషాల్లో ఇంటికి చేరుకోనున్న సమయంలో ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. పోలీసుల కథనం మేరకు.. సంబేపల్లి మండలం బోయపల్లికి రౌతుకుంటకు చెందిన బుజ్జమ్మ(46)కువైట్ నుంచి తిరిగి వస్తున్నారు. చిన్నమండ్యం మండలం కొండమూలకు చెందిన పసల రామలక్ష్మణ్‌ను కారు తీసుకుని చెన్నై విమానాశ్రమానికి రమ్మని తన బంధువుకు చెప్పారు. రామలక్ష్మణ్, ఆయన స్నేహితుడు చిన్నమండ్యం అరబ్‌వీధికి చెందిన ఆఫ్గాన్ రఫీక్ ఖాన్(58) కారు మాట్లాడుకుని బుధవారం రాత్రి చెన్నైకు వెళ్లారు. అర్ధరాత్రి దాటిన తరువాత బుజ్జమ్మను తీసుకుని కారులో బయల్దేరారు. కొద్ది నిమిషాల్లో ఇంటికి చేరుకుంటారనంగా ఈతమానువడ్డిపల్లి వద్ద కారు అదుపు తప్పి రోడ్డుకు ఎడమ వైపున కల్వర్టును ఢీకొంది. ప్రమాదంలో డ్రైవర్ రఫీక్‌ఖాన్‌తోపాటు బుజ్జమ్మకు తీవ్ర రక్తగాయాలయ్యాయి. ఆమె స్పృహ తప్పి పడిపోయింది. రామలక్ష్మణ్‌కు రక్తగాయాలయ్యాయి. స్థానికులు వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో పీలేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్సకు తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యంలో రఫీక్ ఖాన్ మృతి చెందారు. మృతదేహాన్ని పీలేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తిరుపతి రుయాలో చికిత్స పొందుతూ బుజ్జమ్మ మృతి చెందారు. మృతుడు రఫీక్‌ఖాన్‌కు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు. రామలక్ష్మణ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రెడ్డిశేఖర్ రెడ్డి తెలిపారు.

పెళ్లి చూపుల రోజే యువతి అదృశ్యం

బి.కొత్తకోట : తల్లిదండ్రులు కుమార్తె పెళ్లికోసం పెళ్లి చూపులు ఏర్పాటు చేసిన రోజే అదృశ్యమైన ఘటన అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలంలోని బాటవారకురవపల్లిలో జరిగింది. దీనిపై ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు హెడ్‌కానిస్టేబుల్ రెడ్డెప్పనాయక్ గురువారం తెలిపారు. బాటవారకురవపల్లికి చెందిన జి.సురేంద్ర కుటుంబం రైల్వేకోడూరులో స్థిరపడింది. అక్కడ పానీపూరి బండి నడుపుకొంటూ జీవిస్తున్నారు. వీరి కుమార్తె జి.శిల్ప (20) తిరుపతిలో ఫిజీషియన్ కోర్సు మొదటి సంవత్సరం చదువుతోంది. శిల్పకు పెళ్లి చేయాలని తల్లిదండ్రులు నిర్ణయించి వాయల్పాడుకు చెందిన యువకుడితో పెళ్లిచూపుల ఏర్పాటుకు నిర్ణయించారు. రైల్వేకోడూరులో కాకుండా బాటవారకురవపల్లిలో నిర్వహించాలని నిర్ణయించి శిల్పకు సమాచారం ఇవ్వడంతో గ్రామానికి చేరుకుంది. బుధవారం ఇంట్లో పెళ్లి చూపులకు సన్నాహాలు చేసుకుంటుండగా మాయమైంది. ఉదయం పదిన్నర గంటల వరకు ఇంటిలో ఉన్న శిల్ప ఆ తర్వాత కనిపించకపోవడంతో కుటుంబీకులు ఆందోళనకు గురయ్యారు. శిల్ప తండ్రి సురేంద్ర పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.